# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



### THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

**మైత్రి మౌనంగా నిశ్చలంగా** అతని రియాక్షన్స్ గమనిస్తూండిపోయింది. దాదాపు నిముషం దాకా బెనర్జీ మాట్లాడలేక పోయాడు. తర్వాత చటుక్కున వెనక్కి తిరిగి అడిగాడు కుడిచేతి చూపుడు వేలుతో కుర్చీలోని ఆ డైరీ వంక నిప్పులు కురిసేలా చూపిస్తూ -

"అందులోదంతా నిజమేనా?"

తలవూపింది మైత్రి.

అతను వేలిని కదపకుండా, అలాగే ఉంచి మళ్ళీ అడిగాడు. ఈసారి అతని కంఠంలోని తీవ్రత ఇంకాస్త అధికం అయింది.

"అది నిజంగా మీ నాన్న చేతి వ్రాతేనా లేక నువ్వు సృష్టించావా?"

"మా నాన్నదే" చెప్పింది మైత్రి.

మళ్ళీ వెనక్కి తిరిగి కిటికీలోంచి బయటకి చూసాడు. వెనక్కి తిరిగినంత వేగంగా మళ్ళీ మైత్రి వైపు చూసాడు. చేతిలోని సిగరెట్‌ని నేలమీద పడేసి, బూట్ కాలితో దాన్ని ఆర్పుతూ చెప్పాడు.

"మైత్రీ, నువ్వంటే నాకున్న విలువ ఇంత."

మైత్రి పెదవి విప్పలేదు.

"నువ్వేకాదు, మీ నాన్నన్నా అంతే."

అతనికి అర్థం అయింది తను కంట్రోలు చేసుకోలేనంత కోపం తనలో ఏర్పడుతోందని.

"ఎందుకు? ఎందుకింత ఘాతుకానికి వడిగట్టాడు. ఆ ముసలి వెధవ?" ఉద్రుతంగా అరిచాడు.

మైత్రి అతనా డైరీ చదివాక అతని ప్రతిస్పందనని ముందే ఊహించడంతో భయపడలేదు.

"హి ఈజ్, ఏ స్టుపిడ్ ఆఫ్ ఏన్ ఏస్, హి ఈజ్.. హి ఈజ్ ఏ బాస్టర్డ్. ఎ. హి ఈజ్ఎ బాస్టర్డ్. ఎస్. హి ఈజ్ ఏ బేస్టర్డ్ నంబర్ వన్" అరిచాడు గట్టిగా.

"పోయినవాళ్ళ నెందుకు తిట్టడం?" అడిగింది మైత్రి.

క్షణకాలం వెనక్కి తగ్గాడు బెనర్జీ. ప్రశ్నార్థకంగా అతని కనుబొమలు రెండూ పైకి లేచాయి.

"ఆయన పోయారా?" అడిగాడు.

"పోయి రెండు నెలలయింది"

"కాని.. కాని.. ఆయనిలా చేసి ఉండకూడదు."

*"మనిషి ఇంతదాకా జయించలేనిది పగనే"* చెప్పింది.

"బ్లడీ హెల్, బ్లడీ హెల్."

"మా నాన్నగారు పోయాక నెల్రకితం ఇల్లు షిఫ్ట్ చేస్తూ, ఆయనకి సంబంధించిన వస్తువులని సర్దుతూ పనికి రానివి పారేయడానికి వేరు చేయసాగాను. ఈ డైరీ నాకంట పడింది. ఆయనకి డైరీ రాసే అలవాటు లేదు. ఇది ఎవరో ఇచ్చి ఉంటారు అనుకున్నాను. తిరగేస్తే అన్ని పేజీలు ఖాళీగా కనిపించాయి. ఏదయినా రాసుకోవచ్చని పారేయకుండా ఉంచాను. రెండు వారాల తర్వాత కొన్ని పిండివంటలు చేసే విధానం రాద్దామని దాన్ని తెరిస్తే ఆ ఒక్క తారీఖున నాన్నగారు రాసింది నా కంటపడింది. తను చేసినపని ఆయన ఎవరికీ చెప్పలేక, మనసులో ఆ రహస్యాన్ని ఇముడ్చుకోలేక ఈ డైరీలో రాసి ఉంటారు. ఆయన మనస్థత్వం నాకు తెలుసు. అందుకే రాసివుంటారు" చెప్పింది మైత్రి.

బెనర్జీ అకస్మాత్తుగా అయిదేళ్ళ ముసలివాడయినట్లుగా కనిపించాడు మైత్రి కళ్ళకి. మొహం నిండా కాలితో బలంగా నేలమీదకి తోసి దాంట్లో కూర్చుని చెప్పాడు. తర్వాత కసిగా అడిగాడు.

"యువర్ ఫాదర్ ఈజ్ ఏ రియల్ బాస్టర్డ్ ఐసే. నువ్వు చెప్పు ఆయాన చేసిన దారుణం సబబయిందా? నువ్వు చెప్పు మైత్రి."

మైత్రి ఆ ప్రశ్నకు సమాధానం చెప్పబోయే ముందు ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు.

"నేను ప్రతీకారాన్ని నమ్మను. మా నాన్నగారు చేసింది తప్పే. ప్రతీకారం చేయాలని మనసులో ఉన్నంత కాలం మనిషి తన గాయాలని మానకుండా ఉంచుకున్నట్లే. జరిగింది నీకు తెలియచేయటానికి ఈ డైరీని తెచ్చాను"

మళ్ళీ బెనర్జీ ఆలోచనలో పడ్డాడు. అందుకు గుర్తుగా జేబులోంచి సిగరెట్ పేకెట్ని తీసి ఓ సిగరెట్ వెలిగించాడు. తర్వాత అకస్మాత్తుగా అడిగాడు.

"ఇందాక ఆ కుర్రాడు. సుధీరా అతని పేరు? అతను నా కొడుకా?

మైత్రి అవునన్నట్లుగా తలవూపింది.

"సుధీర్ నీ కొడుకు. ఆ విషయంలో నీకు ఎలాంటి అనుమానం అవసరంలేదు."

"ఓ మైగాడ్ థాంక్ యు గాడ్‌థాంక్ యు" చెప్పాడు మెరుస్తున్న కళ్ళతో.

బెనర్జీ మొహంలోని చీకటి తొలిగి కొత్త వెలుగు నెమ్మదిగా ప్రవేశించింది.

లేచి నిలబడి మైత్రి దగ్గరకి వచ్చి ఆమె కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు.

"నా కొడుకుని నేను తీసుకుంటాను. నేను పెంచుకుంటాను. వాడు నా వాడు. హి ఈజ్ మైన్"

మైత్రి నవ్వలేదు. సరే అనలేదు. అతని కళ్ళలోకి తీవ్రంగా చూడసాగింది.

"ఏమిటలా చూస్తున్నావ్?" అడిగాడు బెనర్జీ.

"ఇందాక మా నాన్నని తిట్టావే నువ్వు. సరిగ్గా అది సుధీర్‌కి అప్లయి చేస్తుంది. సుధీర్ ఈజ్ ఏ బాస్టర్డ్. పెళ్ళికాని తల్లిద్వారా ఈ ప్రపంచంలోకి వచ్చిపడ్డ సుధీర్‌ని ఇంగ్లీష్‌లో అంతకు మించి ఏం అంటారు?"

బెనర్జీ ఓ అడుగు వెనక్కి వేసి అడిగాడు.

"యు మీన్.. నిన్ను పెళ్ళి చేసుకోమని అడుగుతున్నావా?" మైత్రి చిన్నగా నవ్వింది. ఎంతో కామ్‌గా చూస్తూ చెప్పింది.

"భయపడకు. నాక్కావలసింది అదికాదు."

"అయితే సుధీర్ తో చెప్పు నేనతని తండ్రినని. నా కొడుకుని నాకు అప్పచెప్పు."

తల అడ్డంగా ఊపింది మైత్రి.

"ఊహూ."

బెనర్జీ మైత్రి కళ్ళలోకి చూసాడు కాసేపు.

"నాకు తెలిసి నువ్వు డబ్బు మనిషివి కావు. కానీ కాలం మనిషిని మారుస్తుంది. ఆల్‌రైట్ నా కొడుకుని నాకు ఎంతకి అమ్మాలనుకుంటున్నావో చెప్పు"

మళ్ళీ తల అడ్డంగా ఊపింది మైత్రి.

"నీ కొడుకు అమ్మకానికి లేడు."

"ఇట్సాల్ రైట్. ఇందులో ఎలాంటి మొహమాటాలు అవసరం లేదు. చెప్పు ఎంత?"

"నేనే విషయంలోనయినా నిర్మొహమాటంగానే ఉంటాను. నీ కొడుకు అమ్మకానికి లేడు."

"మరి? పెళ్ళక్కర్లేదు, డబ్బక్కర్లేదు, ఏం చేస్తే నువ్వు నా కొడుకుని నాకు అప్పచెప్పావ్?" అసనంగా అడిగాడు బెనర్జీ.

"నాక్కావలసింది ఒకటే."

బెనర్జీ, మైత్రి ఒకరివంక మరొకరు నిశ్శబ్దంగా చూసుకుంటూండిపోయారు. క్రమంగా అతని మొహం ఎర్రబడింది.

"కమాన్ ఐసే నీకేం కావాలో చెప్పు. నీకు నీ కొడుకే ముఖ్యం అనుకుంటే ఇంత దూరం వచ్చి, ఆ డైరీ నా చేతికిచ్చి సుధీర్ నా కొడుకని చెప్పవు. నీ మనసులో ఏం ఉందో చెప్పు."

"నా మనసులో ఉన్నది తీరాలంటే నువ్వు చాలా కష్టపడాల్సి వస్తుంది బెనర్జీ."

"డైవర్స్‌లాంటిదా?" అనుమానంగా వెంటనే అడిగాడు బెనర్జీ.

"కాదు. నీకా భయం అక్కర్లేదు."

"మరి? ఇంకేం కావాలి?"

"నేనడగబోయే దాంట్లో నా స్వార్థం ఏం లేదు."

"ఈ భూ ప్రపంచంలో స్వార్థం లేని మనిషిని నువ్వొక్కదానివే అన్నమాట. ఆల్‌రైట్. అలాగే కానీ. ఇంతకా సంగతేమిటో కక్కు" అసహనంతో రెట్టిస్తూ అడిగాడు బెనర్జీ.

"ఇవాళకాదు. రేపు చెపుతాను."

బెనర్జీ కొద్దిసేపు మాట్లడలేదు. అతని మొహంలో చికాకు స్పష్టంగా కనిపించింది. "ఆల్‌రైట్. ఈలోగా సుధీర్ నా కొడుకే అన్న సంగతి నాకు. రూఢిగా తెలియాలి."

"ఎలా? బర్త్ సర్టిఫికెట్టా?"

"కాదు. మా ఇద్దరి బ్లడ్ గ్రూప్ చెక్ చేయిస్తాను. నీ మీద అనుమానంతో కాదు. పూర్తిగా నిర్ధారణ చేసుకోవడానికి."

"ఏజ్ యూ ప్లీజ్."

"ఇంకో విషయం. మన గతం గురించి నా భార్యకి తెలీదు."

"జరిగింది ఆమెకు చెప్పాలనుకుంటే ఇంతకాలం ఆగి ఉండేదాన్ని కాదు. నన్ను కాక నువ్వు మరెవరినో పెళ్ళి చేసుకున్నావని తెలిసిన రోజే చెప్పేదాన్ని. చెప్పడంవల్ల నా సమస్యకి పరిష్కారం లేకపోగా కొత్త సమస్య సృష్టించుకున్నదాన్నయి ఉండేదాన్ని."

"థాంక్ యూ."

"సుధీర్ నీ కొడుకని చెప్పి ఎలా మీ ఇంటికి తీసుకెళ్ళగలవ్?" అడిగింది మైత్రి.

"ఆలోచిస్తాను."

మైత్రి లేచి నిలబడి చెప్పింది.

"ఓ.కే మిస్టర్ బెనర్జీ. గుడ్ డే టు యూ"

బయటకి వెళుతున్న అతని వంక చూసారు శ్యామలాంబ దంపతులు.

బెనర్జీ బయటకి వెళ్ళి మళ్ళీ లోపలికి వచ్చి "నాకంటూ ఈ లోకంలో ఓ సంతానం ఉందన్న మంచి వార్త చెప్పావు. ఐ థాంక్ యు మైత్రి" చెప్పాడు బెనర్జీ మనస్ఫూర్తిగా.

అతను వెళ్ళగానే తలుపు మూసింది.

"ఎవరమ్మా అతను?" అడిగింది శ్యామలాంబ మైత్రిని బెనర్జీ వెళ్ళగానే.

మైత్రి చిన్నగా నిట్టూర్చింది.

"అది చాలా పెద్ద కథ. మీ ఇల్లు విడిచి వెళ్ళేలోగా చెపుతాను. బాగా అలసిపోయాను" చెప్పింది.

మైత్రి తన గదిలోకి వెళ్ళి మంచం మీదకి వాలిపోయింది.

బెనర్జీ కారు స్టార్ట్ అయిన చప్పుడు వినిపించింది.

●●●

మైత్రి ఇంటినుంచి బయటికి వచ్చిన బెనర్జీకి మనసు ప్రశాంతంగా లేదనేకంటే మతి మతిలో లేదంటే, అతని మానసిక స్థితి గురించి సరిగ్గా చెప్పినట్లవుతుంది.

మైత్రి చెప్పింది విన్నాక అతను జీవితంలో ఎన్నడూ షాక్ అవనంతగా అయ్యాడు. తనకి పిల్లలు పుట్టే అవకాశం లేదు అన్న విషయం విన్నాక కూడా అంత షాకవలేదు. కేవలం బాధపడ్డాడు. కానీ తనకి తెలియకుండానే, తన ప్రమేయం లేకుండానే తనకి వేసెక్టమీ ఆపరేషన్ జరిగిందన్న సంగతి అతని ఎంతో వింతగా ఉంది. అదీ మైత్రి తండ్రి ఆ పని చేశాడంటే ఇంకా విచిత్రంగా ఉంది.

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా, ముడతలు పడ్డ మొహంతో ఆయన అనుభవించిన కష్టాలకి అద్దం పట్టేలా ఉండే మొహంతో కనబడే సుబ్బరామయ్యని బెనర్జీ ఎప్పుడూ ఖాతరు చేయలేదు. అసలాయన అనే వ్యక్తి ఉన్నాడని ఎన్నడూ ఆలోచించడంలేదు కూడా. తన వివాహం అనసూయతో అయాక, మైత్రి గురించి అడగడానికి వచ్చినప్పుడు కూడా అతను సుబ్బరామయ్యని సీరియస్‌గా తీసుకోలేదు. దర్రిద్రుడయిన ముసలాయన తననేం చేయలేడు అన్నదే బెనర్జీ నమ్మకం.

అలాంటి సుబ్బరామయ్య తనకి పిల్లలు పుట్టకుండా చేసాడంటే, నమ్మడానికే కాదు, వినడానికే ఎంతో షాకింగ్‌గా ఉంది.

రెండో షాక్ తనకో కొడుకు ఉండటం. దాదాపు పదేళ్ళ కొడుకు తనకి తెలియకుండా ఇంతకాలం పెరుగుతున్నాడన్నమాట! మొదటి విషయం విచారకమయిన షాక్ అయితే రెండో సంగతి సంతోషాన్ని కలిగించే షాక్.

బెనర్జీకి ఆఫీసుకి వెళ్ళాలని లేదు. ఇంటికీ వెళ్ళాలని లేదు. అసలేం చేయాలో, ఎక్కడికి వెళ్ళాలో తెలీని స్థితి. ఓ స్కూల్‌ని చూసి చటుక్కున కారు ఆపాడు.

పిల్లలంతా లంచ్ బ్రేక్ లో బయటకి వస్తున్నారు. బెనర్జీ కారుని ఓ పక్కన ఆపి రియర్ మిర్రర్ లోంచి దాదాపు పదేళ్ళ వయసున్న పిల్లలవంక చూడసాగాడు.

యూనిఫాంలో ఉన్న పిల్లలు స్కూలు బయట ఆగివున్న రకరకాల తినుబండారాలని కొనుక్కుంటున్నారు. దాదాపు అయిదారు నిమిషాలు గడిచాక బెనర్జీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తనకి ఓ కొడుకున్నాడు!

తన రక్తం పంచుకుని పుట్టిన ఓ కొడుకు, తన కొడుకు ఈ లోకంలో ఉన్నాడు.

కళ్ళనీళ్ళని డేష్ బోర్డు మీద ఉన్న టిష్యూ పేపర్ బాగ్ లోంచి ఒకటి తీసుకుని తుడుచుకుని, దాన్ని బయటకి విసిరేసి కారు స్టార్ట్ చేసాడు.

అతను అనుభవించిన షాక్ తాలూకు తరంగాలలోంచి క్రమ క్రమంగా తేరుకునే కొద్దీ బెనర్జీ సెంటిమెంటల్ కాక ప్రాక్టికల్‌గా ఆలోచించసాగాడు.

మైత్రి తన కొడుకుని తనకి అప్పగించడానికి ఓ కండిషన్ పెట్టింది. అదేమిటో చెప్పలేదు. అదేమై ఉంటుంది.

డబ్బు కాదుట. పెళ్ళి చేసుకోవడం కాదుట. తన భార్యకి విడాకులివ్వడం అంతకంటే కాదుట. మరేమై ఉంటుంది? సాధారణంగా మైత్రి స్థానంలో ఉన్న స్త్రీలు కోరుకునేది ఈ మూడే ఆమె స్వార్థం కాక తన మంచికోసంట ఆమె కోరేది ఏమైవుంటుంది అది?

అతనికి ఎంతసేపు ఆలోచించినా అంతుపట్టలేదు.

క్రమంగా బెనర్జీ ఎప్పటి బెనర్జీలా ఆలోచించసాగాడు. అసలు మైత్రి చెప్పిందాంట్లో నిజం ఉందా? ఆ డైరీ ఆమె తండ్రి రాసిందేనా, లేక తనే సృష్టించిందా? సుబ్బరామయ్య చేతి వ్రాతతో తనకి పరిచయం లేదు. అందులో నిజం ఎంతుంది?

ఆ ఆలోచన కలగగానే బెనర్జీ కారు గేరు మార్చాడు. 'యు' టర్న్ తీసుకుని, కారు వెనక్కి తిప్పాడు.

కారు డాక్టర్ దేవ్ సేన్ హాస్పిటల్ ఆవరణలో ఆగింది. కారు దిగి లాక్ చేసి లోపలికి వెళ్ళాడు.

"ఫోన్ చేయకుండా ఇలా ఊడి పడ్డావేమిటి?" అడిగాడు దేవ్ సేన్ నవ్వుతూ..

"ఎనిమిదేళ్ళ క్రితం అనుకుంటాను. మైత్రి అనే అమ్మాయిని అబార్షన్ కోసం నీ దగ్గరకి పంపాను చేసావో, లేదో చెప్పగలవా?"

"ఎనిమిదేళ్ళ క్రితమా? గుర్తులేదు" తల విదిలించి చెప్పాడు డాక్టర్ దేవ్ సేన్, కాసేపు గుర్తుతెచ్చుకోడానికి ప్రయత్నించి.

"ఈ సమాచారం నాకు చాలా ముఖ్యం. నీ అకౌంట్స్‌లో ఉండి ఉండచ్చుగా. లేదా పాత కేస్ షీట్‌లలో, కెన్ యూ ప్లీజ్ చెకప్."

వెంటనే డాక్టర్ దేవ్ సేన్ తల అడ్డంగా ఊపాడు.

"నో. నువ్వు పంపిన అబార్షన్ కేసుల తాలూకు రిఫరెన్స్ నా పుస్తకాల్లో ఎక్కడా కనపడదు. కేస్ షీట్ కూడా పనయ్యాక చింపేస్తాం?"

బెనర్జీ ప్రశ్నార్థకంగా చూడటంతో దేవ్ సేన్ సమాధానం చెప్పాడు.

"రెండు జాగ్రత్తలవల్ల. ఒకటి నా టేక్స్ రిటర్న్స్‌లో ఆ ఆదాయం చూపించను కాబట్టి.."

ఫోన్ మోగడంతో దేవ్ సేన్ ఫోన్ అందుకుని మాట్లాడి పెట్టేసాడు.

"రెండో జాగ్రత్త?" అడిగాడు బెనర్జీ.

"ఏ అమ్మాయయినా కోర్టుకెళితే, నా పుస్తకాలని, కోర్టు సాక్ష్యంగా కోర్టుకి రప్పిస్తే దొరక్కూడదని. పెళ్ళి చేసుకుంటానని ప్రామిస్ చేసి, అబార్షన్ చేయించావని ఏ అమ్మాయయినా కేసు పెడితే ఎలా? నీ మంచి కోరే ఈ రెండో జాగ్రత్త."

"ఎనిమిదేళ్ళ క్రితం పనిచేసిన నర్స్‌ని కాని, లేడీ డాక్టర్‌ని గాని అడిగితే తెలుస్తుందేమో?"

"లేడీ డాక్టర్ లేదు. ఆ నర్స్ పోయి నాలుగేళ్ళయింది ఎవరూ చెప్పలేరు."

"ఫోటో చూపించినా లేక ఆ అమ్మాయిని పిలిపించినా చూసి గుర్తుపట్టగలవా?"

"ఐ యామ్ నాట్ ష్యూర్."

"నాకు వేసెక్టమీ ఆపరేషన్ అయివుండచ్చని ఆ ఫర్టిలిటీ టెస్ట్ ప్రకారం చెప్పగలవా?"

"వేసెక్టమీ ఆపరేషన్ 'అయివుండచ్చని' అన్నావు? అంటే నీకు తెలీకుండానేనా?" ఆశ్చర్యంగా అడిగాడు దేవ్‌సేన్.

"అవును తెలీకుండానే. అసలలాంటిది సాధ్యమేమేనా?"

దేవ్ సేన్ బెనర్జీ మొహంలోకి కొద్దిక్షణాలు నిశితంగా చూసి అడిగాడు.

"అసలేం జరిగిందో చెప్పు."

బెనర్జీ మొహంలోని సందేహాన్ని గమనించి మృదువుగా చెప్పాడు దేవ్ సేన్.

"నువ్వు దాచాల్సిన పనిలేదు. డాక్టర్ దగ్గర ఏం దాచకూడదు. కష్టాలు స్నేహితుడితో పంచుకోవాలి. నేను స్నేహితుణ్ణి, డాక్టర్ ని కూడా. కమాన్. వాటీజ్ కుకింగ్ ఇన్ యువర్ బ్రెయిన్?"

బెనర్జీ నెమ్మదిగా తనకి ఏ పరిస్థితుల్లో వేసెక్టమీ ఆపరేషన్ అయిందని మైత్రి చెప్పిందో, ఆ వివరాలన్నీ చెప్పాడు. అయితే మైత్రి గురించి, తనకి ఆమె ద్వారా కొడుకు పుట్టడం గురించి మాత్రం దాచాడు.

"ఇలా నాకు తెలీకుండా ఆ ఆపరేషన్ జరిగి ఉండచ్చా?" అడిగాడు బెనర్జీ.

తల పంకించాడు డాక్టర్ దేవ్ సేన్.

"నీకు జరిగిన కారు ఏక్సిడెంట్ గురించి నాకు గుర్తుంది. ఆ సమయంలో నీకు వేసెక్టమీ ఆపరేషన్ జరగడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. నిజానికి లోకల్ ఎనిస్థీషియా చాలు ఆ ఆపరేషన్‌కి. అది జరిగాక ఇంటికి నడిచి వెళ్ళే వాళ్ళు నాకు చాలా మంది అనుభవం. ఒకటి, రెండు రోజులు గాయం మానేదాకా స్వల్పంగా నొప్పి ఉంటుంది. క్రమంగా అదీ పోతుంది. నీకు ఏక్సిడెంట్‌లో చాలా గాయాలయాయి. కాబట్టి నువ్వు ఆ నొప్పిని ప్రత్యేకంగా నోటీస్ చేసి ఉండవు. మూడు రోజులు హాస్పిటల్లోనే ఉన్నావు కాబట్టి డిశ్చార్జి అయే రోజుకి నీకు తేడా తెలిసి ఉండదు"

"అది జరగడం నిజమో, అబద్ధమో కనుక్కోగలవా?"

"వేరే పరీక్ష అనవసరం. ఖచ్చితంగా జరిగే ఉంటుంది. లేకపోతే నీ రిపోర్ట్ మరో విధంగా ఉండేది" చెప్పాడు డాక్టర్ దేవ్ సేన్.

చిన్నగా నిట్టూర్చాడు బెనర్జీ. "సో దట్ వజ్ దట్" చెప్పాడు.

✷✷✷

***(ఇంకా ఉంది)***

Post your comments